క్లుప్తంగా

ఉచిత కంటి వైద్య శిబిరానికి స్పందన


శిబిరంలో ఎమ్మెల్యే అమర్నాథరెడ్డి

గంగవరం: మండలంలోని లయన్స్ క్లబ్‌లో ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి మంచి స్పందన లభించింది. చిత్తూరు మాజీ ఎంపీ దివంగత రామక్రిష్ణారెడ్డి జ్ఞాపకార్థం ఆయన కుటుంబ సభ్యుల సహకారంతో ఈ శిబిరం ఏర్పాటు చేశారు. శిబిరాన్ని పలమనేరు ఎమ్మెల్యే అమర్నాథరెడ్డి ప్రారంభించి మాట్లాడారు. కుప్పం పీఈఎస్ ఆసుపత్రి వైద్యులు ఈ శిబిరంలో 130 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. 12మందిని కంటి ఆపరేషన్ల కోసం ఎంపిక చేసినట్టు లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ రఘు తెలిపారు.

కంటి ఆపరేషన్లకు 32మంది ఎంపిక


కంటి వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

కుప్పం: పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో 32 మందిని కంటి ఆపరేషన్లు నిమిత్తం ఎంపిక చేసినట్లు నిర్వాహకులు జగదీష్ బాబు తెలిపారు. సాయిమాత సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో బెంగళూరు శారద కంటి ఆస్పత్రి వైద్యులు ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో మొత్తం 120 మంది కంటి సంబంధిత సమస్యలతో బాధపడుతున్న వారిని పరీక్షించారు. కంటి ఆపరేషన్‌కు ఎంపిక చేసిన బెంగళూరు శారద కంటి అస్పత్రికి తరలించారు. వీరికి సోమవారం ఆపరేషన్లు చేయనున్నట్టు వైద్య బృందం తెలిపింది. కార్యక్రమంలో కంటి వైద్యులు లావణ్య, బాబు, మటార్లపల్లి వీరభద్రప్ప పాల్గొన్నారు.

శ్యాంప్రసాద్ ముఖర్జీకి నివాళి


శ్యాంప్రసాద్ ముఖర్జీ చిత్రపటం ముందు నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

పుంగనూరు: జన సంఘ్ పార్టీ వ్యవస్థాపకుడు శ్యాంప్రసాద్ ముఖర్జీ వర్ధంతిని బీజేపీ నాయకులు ఆదివారం నిర్వహించారు. స్థానిక నాయకులు రాజారెడ్డి, అయూబ్‌ఖాన్, నానబాలకుమార్ ఆధ్వర్యంలో ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన సేవలను స్మరించారు. రాజారెడ్డి మాట్లాడుతూ గోహత్యను నిషేధించాలని శ్యాంప్రసాద్ పోరాటం చేశారని, కానీ అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ఖాతరు చేయకపోవడంతో గోవధ సాధారణమైందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు బాబు, ఆదినారాయణ, వెంకటరెడ్డి, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

పుష్పలోకేష్‌కు మిసెస్ ఇండియా అవార్డు


అవార్డు అందుకుంటున్న పుష్పాలోకేష్

తిరుపతి కల్చరల్: సిల్వర్‌ఓక్ బెంగళూరు ఆధ్వర్యంలో నిర్వహించిన అందాల పోటీలలో రన్నరప్‌గా నిలిచిన తిరుపతికి చెందిన సి.పుష్పాలోకేష్‌కు మిసెస్ ఇండియా అవార్డు లభించింది. బెంగళూరులో ఈనెల 9వ తేదీ నుంచి మూడు రోజులపాటు మిస్, మిసెస్ క్లాసిక్, మిసెస్ ప్రీమియం తదితర మూడు విభాగాలలో జరిగిన ఈ జాతీయ స్థాయి పోటీలకు 700 మందికి దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో ఉత్తమ ప్రతిభతో ఎంపికైన 30 మంది ఈ పోటీలలో పాల్గొన్నారు. మిసెస్ క్లాసిక్ విభాగంలో పుష్పాలోకేష్ మిసెస్ ఇండియా అవార్డుకు ఎంపికై ంది. ప్రముఖ కన్నడ నటుడు భార్గవ్ చేతులమీదుగా ఆమె ఈ అవార్డును అందుకున్నారు.

బాలల హక్కులు, చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

చిత్తూరు కలెక్టరేట్ : బాలల హక్కుల పరిరక్షణ, చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఐసీడీఎస్ పీడీ నాగశైలజ తెలిపారు. ఆదివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ, జిల్లాలోని బాలల హక్కులను కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. బాలల హక్కుల పరిరక్షణ, బాలలపై లైంగిక దాడుల నిరోధక చట్టం -2012, బాలల న్యాయ చట్టం, బాల్య వివాహాల నిరోధక చట్టం-2006 చట్టాలపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పిస్తున్నామన్నారు. ప్రజలతో పాటు బాలబాలికల్లో చైతన్యం తీసుకురావడంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, వసతి గృహాల వార్డెన్లు ముందుండాలని కోరారు.

ధరాఘాతం

- నిత్యావసర వస్తువుల ధరలకు రెక్కలు
- కొనలేమంటున్న సామాన్యులు


పుంగనూరులో సామాన్యులకు అందుబాటులో లేని పప్పులు


పుంగనూరులో ఆకాశనంటుతున్న కూరగాయలు


పుంగనూరులో అమ్మకానికి ఉంచిన ఉల్లిపాయలు

పుంగనూరు : పడమటి నియోజకవర్గమైన పుంగనూరులో నిత్యావసర సరకులు, కూరగాయలు ధరలు అమాంతంగా పెరిగిపోవడంతో పేదలు, సామాన్య, మధ్య తరగతి ప్రజలు బెంబేలెత్తుతున్నారు. స్థానికంగా కూరగాయల పంటల సాగు తగ్గడం, పంటలు కాస్త దెబ్బతినడంతో పొరుగునే ఉన్న కర్ణాటక రాష్ట్రం నుంచి కూరగాయలను వ్యాపారులు దిగుమతి చేసుకోవాల్సి వస్తోంది. ఫలితంగా బహిరంగ మార్కెట్‌లో ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. కాస్తో కూస్తో కూరగాయల సాగు చేస్తున్న రైతులకు మాత్రం ఆదాయం కళ్లజూస్తున్నారు.

మండుతున్న నిత్యావసర సరుకుల ధరలు

పట్టణం సుమారు మూడు నియోజకవర్గాలకు ప్రధాన కేంద్రం కావడంతో రోజూ వేలాది మంది తమ అవసరాలు, వివిధ కొనుగోళ్ల నిమిత్తం పుంగనూరుకు వచ్చి వెళ్తుంటారు. ప్రస్తుతం ఎండు మిరపకాయలు కిలో ఒకటవ రకం రూ రూ.280, రెండవ రకం రూ. 240 ఉంది. ఉల్లిపాయలు (ఎరగడ్డలు) కిలో ధర రూ.45 ఉండగా, తెల్లగడ్డలు కిలో రూ.210 ఉంటోంది. అలాగే కందిపప్పు కిలో రూ.180, పెసరపప్పు కిలో రూ.120, ఉద్దిపప్పు కిలో రూ.150 , శెనగ బేడలు కిలో రూ.100, బటాని కిలో రూ.100, తెల్లశెనగలు కిలో రూ.120, ఎర్రశెనగలు కిలో రూ.100, శనగపప్పు కిలో రూ.125, శనగనూనె లీటరు రూ.160, రీఫైండ్ ఆయిల్ లీటరు రూ.110, పామాయిల్ లీటర్ రూ.95, డాల్డా కేజి రూ.120 ఉంటోంది.

కూరగాయల ధరలు కూడా..

ప్రధానంగా ప్రతి ఇంటా వాడే కూరగాయల్లో ఎర్రగడ్డలు, టమాటాలు తప్పనిసరి. అయితే ఇప్పుడు టమాటా కిలో రూ.100 కావడంతో బావురుమంటున్నారు. అలాగే ముళ్ల వంకాయలు(సింగిరిగుంట, అరవపల్లి) కిలో రూ.130, డిస్కో వంకాయలు కిలో రూ.80, క్యారెట్ కిలో రూ.80, బీన్స్ కీలో రూ.150 , కాకరకాయ కిలో రూ.50, బెండకాయ కిలో రూ.40, బీరకాయ ఇలో రూ.50, దోసకాయ కిలో రూ.40, అల్లం కిలో రూ.180, మునక్కాయలు రూ.130, పందిరి చిక్కుడు కిలో రూ.50, గోరుచిక్కుడు కాయలు కిలో రూ.60 , దొండకాయ కిలో రూ.60, బీట్‌రూట్ కిలో రూ.60, ఉర్లగడ్డ కిలో రూ.40 , ముల్లంగి కిలో రూ.40, మిర్చి కిలో రూ.30లకు అమ్ముతున్నారు. ఇక ఆకు కూరల్లో ఎరబద్ది ఆకు, మెంతాకు, మునగ ఆకు, పూదిన కట్టలు రూ.20, కరివేపాకు కట్ట రూ.30 , కొత్తిమీర కట్ట రూ. 80 ఉంటోంది. పెరిగిన ఈ ఒక వైపు రైతులకు ధరలు లాభాన్ని చేకూర్చుతున్నా, సామాన్యులు మాత్రం సరుకులు కొనుగోలు చేయలేక ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ధరల నియంత్రణకు చర్యలేవీ?



నిత్యావసర సరకులు బెంగళూరు నుంచి దిగుమతి చేసుకుంటున్నాం. ధరలు నియంత్రణ లేకపోవడంతో ప్రతి వారం ధరల్లో మార్పు వస్తోంది. కర్ణాటక నుంచి తీసుకురావడంతో ప్రతి దశలోనూ ధర పెరుగుతుంది. ప్రభుత్వం స్థానికంగా రైతుల వద్ద ఉన్న పంటలను కొనుగోలు చేసి ఇక్కడే విక్రయించేలా చర్యలు తీసుకోవాలి.

– ఏవీ.చలపతి, వర్తక వ్యాపారుల సంఘం అధ్యక్షుడు, పుంగనూరు

కూరగాయలు తగ్గడం లేదు



కూరగాయల ధరలు రోజూ పెరుగుతూనే ఉన్నాయి. తగ్గే పరిస్థితులు కనపడటం లేదు. రైతులు స్థానికంగా కూరగాయలు పండించడం తగ్గించారు. ఈ కారణంగా కర్ణాటకలోని శ్రీనివాసపురం, చింతామణి, ముళబాగిల్ నుంచి కూరగాయలు దిగుమతి జరుగుతోంది. ఫలితంగా ధరలు పెరుగుతున్నాయి.

– కె.రెడ్డిప్రసాద్. మంజుభవన్ హోటల్ యజమాని, పుంగనూరు

భాగ్యవతి అంత్యక్రియల్లో మాజీ ఎమ్మెల్యే


అంత్యక్రియలకు తీసుకెళ్తున్న మృతదేహం ముందు వెంకటేగౌడ, పార్టీ నాయకులు

పలమనేరు: పలమనేరు సర్పంచుల సంఘ అధ్యక్షులు విశ్వనాథరెడ్డి సతీమణి భాగ్యవతి అంత్యక్రియలకు మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ ఆదివారం హాజరై ఆమె మృతదేహానికి నివాళుర్పించారు. పాడెను మోశారు. కార్యక్రమంలో వెంకటేగౌడ సతీమణి పావనిగౌడ, నియోజకవర్గంలోని పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం


వనమలదిన్నెలో పూర్వ విద్యార్థులతో ఉపాధ్యాయులు

పుంగనూరు: మండలంలోని వనమలదిన్నె హైస్కూల్‌లో 2011–2012లో పదవ తరగతి చదివిన పూర్వ విద్యార్థుల సమావేశం ఆదివారం ఘనంగా నిర్వహించారు. తమ ఉన్నతికి బాటలు వేసిన అప్పటి గురువులు వేణుగోపాలరాజు, జివి.రమణ, మహమ్మద్ ఇక్బాల్, పవన్ కుమార్, మోహన్, శేషాద్రినాయుడు, ఆనంద, రెడ్డిరాజేశ్వరిలను ఘనంగా సన్మానించారు. వారి ఆశీస్సులు పొందారు. పూర్వ విద్యార్థులు భార్గవ్, సురేంద్ర, జయచంద్ర, విశ్వాస్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. పూర్వ విద్యార్థులు నాగవేణి, నాగరత్న, సంధ్య, సుమతి, వెంకట్రమణ తదితరులు పాల్గొన్నారు.

మేము సైతం..!


బైరెడ్డిపల్లెలో మొక్కలు నాటుతున్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు

- మొక్కలు నాటిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు
- బెంగళూరు నుంచి వచ్చి పచ్చదనం పెంపునకు కృషి
- పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తాం

బైరెడ్డిపల్లె: కర్ణాటక రాష్ట్రం బెంగళూరు పట్టణంలో స్థిరపడ్డ సాఫ్ట్‌వేర్ ఉద్యోగస్తులు పర్యావరణ పరిరక్షణలో ఇతోధికంగా భాగస్వాములయ్యారు. మండలంలోని వివిధ గ్రామాల్లో ఆదివారం మామిడి, నిమ్మ, నేరేడు మొక్కలను నాటేందుకు శ్రీకారం చుట్టారు. రెండేళ్లుగా సుమారుగా 11,512 మొక్కలను ఉచితంగా రైతులకు అందజేసినట్లు చెప్పారు. సెలవు రోజుల్లో మండలంలోని గ్రామాల్లో మొక్కలను నాటి, రైతులతో ఆనందంగా గడిపి వెళ్తామని వారు చెప్పారు. పర్యావరణ పరిరక్షణపైనే మానవాళి మనుగడ ఆధారపడి ఉందని, మొక్కలను విరివిగా పెంచడమే దీనికి మార్గమని ఎంచి ఈ దిశగా తమవంతు కృషి చేస్తున్నట్టు చెప్పారు. పచ్చదనం పెంపు వల్ల వర్షాలు బాగా కురిసి చెరువులు, కుంటల్లో నీరు చేరి భూగర్భ జలాల మట్టం పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు నీలం గంగాధర, కట్టమంచి పరంజ్యోతి, రవికుమార్, కార్తీక్, మనోజ్ఞ, విశ్వచైతన్య, లోకేశ్వరి, దీక్షిత, వాసుకి, జనని, రాణి, శృతి, అభిషేక్, యామిని, మోహన్,యశ్విన్, దివాకర్, షాహానా, చరణ్‌సాయి తదితరులు పాల్గొన్నారు.

శ్రీరాముడి రథోత్సవం



తవణంపల్లె: మండలంలోని టి.పుత్తూరు కోదండరామాలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం భక్తజనసందోహం నడుమ శ్రీరాముడి రథోత్సవం కోలాహలంగా సాగింది. భక్తులు శ్రీరామ, గోవింద నామస్మరణలు చేస్తూ రథాన్ని లాగారు. ఆలయంలో ఉదయం వేదపండితులు సీతారామలక్ష్మణులకు అభిషేకం, ప్రత్యేక అలంకరణ చేశారు. అర్చనలు, పూజలు నిర్వహించి ధూప దీప నైవేద్యం సమర్పించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఉయ్యాలసేవ ఘనంగా నిర్వహించారు. ఉభయకర్తలు స్వామికి పట్టువస్త్రాలు, పూజాసామగ్రిని ఊరేగింపుగా తెచ్చి సమర్పించారు.

డయేరియా నియంత్రణకు పకడ్బందీ చర్యలు

- నగరపాలక కమిషనర్ అరుణ

చిత్తూరు కలెక్టరేట్ : డయేరియా నియంత్రణకు పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నట్టు నగరపాలక సంస్థ కమిషనర్ అరుణ తెలిపారు. ఆమె ఆదివారం చిత్తూరు నగరంలో స్టాప్ డయేరియా క్యాంపెయిన్-2004 నియంత్రణ అవగాహన కార్యక్రమాలను ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ నగరంలో డయేరియా నియంత్రణ కార్యక్రమాలకు అధికారులతో ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ కమిటీలు ఏర్పాటు చేశామన్నారు. టాస్క్‌ఫోర్స్ కమిటీ క్షేత్రస్థాయిలో సమన్వయంతో పనిచేయాలన్నారు. నీటి సరఫరా పర్యవేక్షణ, నీటి నాణ్యత కోసం ఆర్సీ హెచ్, ఈకోలై పరీక్షలు చేయడం, లీకేజీలను నివారించడం తదితర పనులను నిరంతరం పర్యవేక్షించాలని ఎంఈని ఆదేశించారు. అంగన్‌వాడీ వర్కర్లతో సమన్వయం చేసుకుని మూడేళ్ల లోపు పిల్లలకు పౌష్టికాహారం అందేలా చూడడం, గర్భిణులు, బాలింతలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సీడీపీవోకు సూచించారు. నగరంలో పారిశుద్ధ్య నిర్వహణ, ఇళ్ల నుంచి చెత్త సేకరణ, డ్రైనేజీల్లో పూడికతీత, ఫాగింగ్ చేయడం, దోమలు, కీటకాల ద్వారా వ్యాప్తి చెందే వ్యాధుల నియంత్రణకు ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు పకడ్బందీగా చేయాలని ఎంహెచ్‌వోను ఆదేశించారు. పాఠశాలల్లో విద్యార్థులు భోజనానికి ముందు చేతులు కడిగేలా అవగాహన కల్పించడం, డయేరియా నియంత్రణ, ఓఆర్ఎస్, జింక్ వినియోగంపై వకృత్వ, చిత్రలేఖనం పోటీలు నిర్వహించాలని ఎంఈవోలకు సూచించారు. స్వయం సహాయక సంఘాల సభ్యులతో సమన్వయం చేసుకుని వార్డు సచివాలయాలు, రాత్రి వసతి కేంద్రాలు, హోటల్స్ ఇతర ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. డయేరియా నియంత్రణ కార్యక్రమాలను అన్ని వార్డుల్లో పకడ్బందీగా నిర్వహించే బాధ్యతను సహాయ కమిషనర్, ఆర్‌వోలకు అప్పజెప్పినట్లు తెలిపారు.

టీడీపీ విధ్వంసకాండ హేయం

- దాడులు చేసి ఆస్తులకు నష్టం కలిగించడమే లక్ష్యమా?
- హామీలను కొంతకాలం పాటు నెరవేర్చకుండా ఉండడానికే ఇలా చేస్తున్నారా?
- అధికారంలోకి రాగానే కూటమి దాష్టీకం చూసి విస్తుపోతున్న ప్రజలు


నాగరాజు

వి.కోట: టీడీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఉద్దేశపూర్వకంగా కక్ష సాధింపు చర్యలకు పూనుకుని రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, పార్టీ సానుభూతిపరులపై దాడులు చేయడం, ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేయడం శోచనీయమని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి పిఎన్ నాగరాజు మండిపడ్డారు. ఆదివారం ఆయన పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. రాష్ట్ర మంత్రివర్గ ఆమోదంతో తాడేపల్లిలో వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయాన్ని కూల్చడం కక్ష సాధింపు చర్య అని నిరసించారు. ప్రజలు తమకేదో మేలు చేస్తారని, అభివృద్ధి చేస్తారనే నమ్మకంతో ఆ పార్టీ మేనిఫెస్టోను నమ్మి కూటమికి అధికారం కట్టబెడితే దీనికి భిన్నంగా ఆ పార్టీ నాయకత్వం నడుచుకుంటోందని దుయ్యబట్టారు. కూటమి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి దాడులు చేయడమే పనిగా పెట్టుకుని విధ్వంస, కుట్ర రాజకీయాలు చేస్తున్నట్లు చెప్పారు. హైకోర్టు ఎలాంటి చర్యలు తీసుకోరాదని స్టే ఇచ్చినప్పటికీ బేఖాతరు చేస్తూ తాడేపల్లిలో కూల్చివేత పనులు చేయడం గర్హనీయమని, ప్రజలు కూడా వీరి విధ్వంసకాండను చూసి విస్తుపోతున్నారన్నారు. కూటమి దుశ్చర్యలను ప్రజాస్వామ్యవాదులు ఖండించాలన్నారు. అంతా లోకేష్ 'రెడ్ బుక్' టార్గెట్ ప్రకారం ఇలా చేస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రజల దృష్టి హామీలపై కాకుండా విధ్వంసాలతో కొంతకాలం మరల్చేందుకే ఇలా చేస్తోందని ఇకపై ఆపి ఏదైతే సూపర్ సిక్స్ హామిలు ఇచ్చారో దాన్ని అమలు చేయడానికి నూతన ప్రభుత్వం కృషి చేయాలన్నారు. కూటమి నాయకులు ఇకనైనా విధ్వంసకాండకు స్వస్తి పలికి, ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంపై దృష్టి సారించాలని హితవు పలికారు.

ఆశలతో 'ఖరీఫ్'


పలమనేరు మండలంలో వేరుశనగ విత్తనాలను వేస్తున్న రైతు

- వేరుశనగ విత్తనాలు వేయడంలో రైతుల బిజీ

పలమనేరు: ఈ పర్యాయం సకాలంలో వర్షాలు కురవడంతో రైతులు వేరుశనగ విత్తనాలు వేయడంలో బిజీ అయ్యారు. ఆదివారం నుంచి చేలల్లో విత్తనకాయలు వేసే కార్యక్రమం పలమనేరు ప్రాంతంలో ఊపందుకుంది. మండలానికి సంబంధించి నాలుగు వేలమంది రైతులు ప్రతిఏటా వేరుశనగ సాగు చేస్తారు. వర్షాలు పడడంతో దుక్కులు సిద్ధం చేశారు. ఇప్పటికే సబ్సిడీ వేరుశనగ విత్తనాలను సైతం పొందారు. ఏటా ఆరు వేల ఎకరాల్లో వేరుశనగ సాగు కావాల్సి ఉంది. కానీ ఇప్పటికి 40 శాతం మంది రైతులు మాత్రమే ప్రస్తుతం విత్తనాలను వేసేందుకు సిద్ధమవుతున్నారు. ఎకరా పొలానికి రెండు మూటల వేరుశనగ కాయలు లేదా 60 కేజీల విత్తనాల అవసరముంది. ఈ లెక్కన ప్రస్తుత రేట్ల ప్రకారం రూ 3వేలు అవుతుంది. దీనికి తోడు కాంప్లెక్స్ తదితర ఎరువులకు రూ.2వేలు కావాలి. ఇక మడకకు రోజుకు రూ.700 చొప్పున మూడు రోజులకు రూ.2,100 వందలు, కూలీలకు పది మందికి రూ.3వేలు ఇవ్వాలి. సాలు విత్తనాలతో కలిపి మరో రూ.2 వేలు అవుతోంది. మొత్తంగా ఎకరా పొలంలో విత్తనాలు వేయడానికి సుమారు రూ 10వేలు వ్యయం చేయాల్సి వస్తోంది. ఈఏడాదైనా ఆశించిన గిట్టుబాటు లభిస్తుందో లేదో వేచి చూడాల్సిందే.

ట్రాఫిక్ అస్తవ్యస్తం

- దుకాణాల వద్ద అడ్డదిడ్డంగా వాహనాల పార్కింగ్
- రోడ్డుదాటడమే కష్టంగా మారిన వైనం
- పట్టించుకోని అధికారులు


రాయలపేటలో నాలుగురోడ్ల కూడలిలో స్తంభించిన ట్రాఫిక్

పెద్దపంజాణి: అసలే ఇరుకు రోడ్లు...ఆపై ఇష్టానుసారంగా రోడ్డుపైనే ఎక్కడ పడితే అక్కడ వాహనాల పార్కింగ్..తరచూ ట్రాఫిక్ సమస్యలతో ప్రజలకు చికాకు తెప్పిస్తోంది. అయినా అధికారులు మాత్రం దీనిపై దృష్టి సారించడం లేదు. ఇదీ మండలంలోని రాయలపేట ఎదుర్కొంటున్న పరిస్థితి. రాయలపేట చుట్టుపక్కల గ్రామాలకు వెళ్లే ప్రధాన కూడలి కావడంతో బస్సులు, ఆటోలు, ఇతర ప్రైవేటు వాహనాలు రోడ్డుపైనే ఆపి ప్రయాణికులను ఎక్కించుకోవడం, దించడం చేస్తున్నారు. ఫలితంగా ట్రాఫిక్‌కు సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. రోడ్డుకు ఇరువైపులా ఉన్న దుకాణాలలో సరకులు కొనుగోలుకు వచ్చిన వినియోగదారులు తమ వాహనాలను రహదారిపై పార్కింగ్ చేస్తుండడంతో నిత్యం ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది.

ఇదీ పరిస్థితి...

దాదాపు మూడు దశాబ్దాల క్రితం అప్పటి జనాభాకు అనుగుణంగా గ్రామంలో రోడ్లను నిర్మించారు. ప్రస్తుతం పెరిగిన జనాభా, వాహనాలకు ఆ రోడ్డు సరిపోవడం లేదు. ఆనాటి నుంచి నేటి వరకు గ్రామంలో రోడ్డు విస్తరణ పనులు చేపట్టకపోవడంతో ట్రాఫిక్ సమస్య జటిలంగా మారింది. గ్రామంతో పాటు పరిసర ప్రాంతాల నుంచి వాహనాల రాకపోకలు అధికం కావడంతో సమస్య మరింత తీవ్రరూపం దాల్చింది.

పెరిగిన రాకపోకలు

పలమనేరు నుంచి చౌడేపల్లె పరిసర ప్రాంతాలకు రాయలపేట మీదుగా అధిక సంఖ్యలో నిత్యం వాహనాలు ప్రయాణిస్తుంటాయి. చిత్తూరు, తమిళనాడు, కర్ణాటక తదితర ప్రాంతాల ప్రజలు ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ గంగమ్మ దర్శనానికి రాయలపేట మీదుగా రాకపోకలు సాగిస్తుంటారు. చౌడేపల్లె, సోమల, సదుం మండలాల నుంచి పలమనేరులోని ప్రైవేటు కళాశాల బస్సులు కూడా ఇదే మార్గం మీదుగా వెళ్తుంటాయి. దీంతో పాటు ఆ మూడు మండలాల రైతులు తమ వ్యవసాయ ఉత్పత్తులను పలమనేరు వ్యవసాయ మార్కెట్‌కు తరలిస్తుంటారు. అయితే రాయలపేటలో వాహనాలకు పార్కింగ్ స్థలం లేకపోవడంతో రోడ్డుపైనే నిలుపుతుంటారు. కళాశాల బస్సులు, కూరగాయల ఆటోలు, ఆర్టీసీ బస్టులు, స్థానికంగా ఉన్న టోలు ఒకేసారి గ్రామంలోకి ప్రవేశించడంతో తీవ్ర అంతరాయం కలిగి రాకపోకలు స్తంభించిపోతున్నాయి. దీనికి తోడు బజారు వీధిలోని నాలుగు రోడ్ల కూడలి, రాములవారి వీధిలోని ఇండియన్ బ్యాంకు దగ్గర పరిస్థితి మరీ ఘోరంగా ఉంటోంది. బ్యాంకుకు వచ్చేవారు తమ వాహనాలను రోడ్లపై అడ్డదిడ్డంగా నిలుపుతున్నారు. ఇప్పటికే ట్రాఫిక్ కష్టాలు ఎదుర్కొంటున్న వాహనచోదకులకు వారపు సంత రూపంలో మరిన్ని సమస్యలు తప్పడం లేదు. ప్రతి గురువారం రోడ్డుపైనే సంత జరుగుతుండడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

తొలగని ఆటంకాలు

దాదాపు ఆరేళ్ల క్రితం మండలంలోని కోగిలేరు చెక్ పోస్టు నుంచి రాయలపేట మీదుగా చౌడేపల్లె మండల సరిహద్దులోని వీరప్పల్లె వరకు ఆర్అండ్‌బీ అధికారులు రోడ్డు విస్తరణ పనులను పూర్తి చేశారు. గ్రామంలో రోడ్డు విస్తరణ కోసం మార్కింగ్ వేశారు. అయితే దుకాణదారులు, ఇంటి యజమానులకు, అధికారులకు విస్తరణ విషయంలో ఏకాభిప్రాయం కుదరకపోవడంతో రోడ్డు విస్తరణ ఎటూ తేలకుండా సందిగ్ధంలో పడడంతో వాహనదారుల ఆశలు అడియాశలుగా మారాయి. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్డు విస్తరణ సమస్య పరిష్కారానికి, అలాగే పోలీసులు ట్రాఫిక్ క్రమబద్ధీకరణ చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

దాతల ఔదార్యం అభినందనీయం



మాట్లాడుతున్న డీఈఓ శేఖర్, నగదు బహుమతి అందుకుంటున్న విద్యార్థిని

పుత్తూరు: విద్యాభివృద్ధికి తమవంతు సాయం అందిస్తున్న పుత్తూరుకు చెందిన శ్రీసరస్వతీ మాతా సాంఘిక సేవా సమాజం సభ్యులు అభినందనీయులని తిరుపతి డీఈఓ వి.శేఖర్ అన్నారు. మండల స్థాయిలో పదో తరగతిలో ప్రథమ, ద్వితీయ స్థాయిలో ఉత్తీర్ణులైన పలు పాఠశాలల విద్యార్థినీ విద్యార్థులకు నగదు ప్రోత్సాహక బహుమతులు, అలాగే పలు పాఠశాలలకు చెందిన పేద విద్యార్థులు 400 మందికి విద్యా సామగ్రిని ఆదివారం స్థానిక మెయిన్ స్కూల్‌లో సేవా సమాజం ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. రామకృష్ణమరాజు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా డీఈఓ హాజరై పంపిణీ చేసి మాట్లాడారు. ప్రస్తుతం విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు చోటు చేసుకున్నాయని తెలిపారు. దాతలు, ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను విద్యార్థులు అందిపుచ్చుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డీవైఈఓ హెచ్.ప్రభాకర్‌రాజు, ఎంఈఓలు బి.తిరుమలరాజు, ఎం.బాలసుబ్రమణ్యం, సేవా సంఘ సభ్యులు ప్రసాద్, రవిశంకర్, బాలసుబ్రమణ్యం, ప్రసాద్ బాబు, యుగంధర్‌రాజు, కుమారవేలు, పురుషోత్తం, వినోద్‌బాబు, అమరనాథ్, రామమోహన్, మురళి, సుబ్రమణ్యం, శ్రీనివాసరాజు, సుబ్రమణ్యం ఆచారి, పురుషోత్తంశెట్టి, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.